
# ఛాయ

'లాభంలేదు. ఇంకెన్నోరోజులు బతకదు. ఏ క్షణాన్నయినా పోవచ్చు. వయసా పెద్దది. గుండె బలహీనంగా ఉంది. చుట్టాలెవరైనా ఉంటే పిలిపించుకోండి. నేను రోజూ వచ్చి చూసి వెళ్తుంటాను' డాక్టర్,రామ్మూర్తిని




గది బయటకు పిలిచి చెప్తున్నారు.

రామ్మూర్తి బదులుగా ఏమన్నాడో కానీ మంచంలో పడుకున్న సావిత్రమ్మకు డాక్టర్ మాటలు స్పష్టంగానే వినిపించాయి. ఆమె మనసులోనే అనుకుంటోంది. 'ఈ అరవై అయిదేళ్ల జీవితంలో ఎన్నోసార్లు చస్తే బాగుండనుకున్నాను. కానీ చిత్రంగా ఇప్పుడేమో బతకాలనిపిస్తోంది. తన బిడ్డల్ని, మనవల్ని, ఈ సొంత ఇంటిని వదిలిపోతుందా తను'.

ఇంతలో పెరట్లో మామిడిచెట్టు, దానికి వేలాడుతున్న కాయలు కిటికీగుండా ఆమె కంటికి ఆనాయి.

'ఆ చెట్టు తనునాటిందే. మామిడికాయలంటే చాలా ఇష్టం తనకు. వేసవి వచ్చిందంటే చాలు, చెట్టుకు పిందెపడ్డప్పట్నుంచీ రోజుకు మామిడికాయ పప్పే వండేది. ఏమిటో తన హయాం దాటిపోయింది. కోడళ్లొచ్చాక కందిపప్పు మండిపోతోంది. రోజూ పప్పెందుకు? అయినా పిల్లలకు వేడిచేస్తుంది. మీది పెద్ద వయసు. పప్పేం వంటికి పడుతుంది' అంటుంది.

జె.శ్యామల

మామిడికాయ పప్పు కోసమైనా ఇంకా బతకాలని పిస్తోంది. వెంటనే తన ఆలోచనకు ఒకంత సిగ్గు కూడా అనిపించిందామెకు. కాని ఆలోచనకు సిగ్గూ, శరమూ ఉండవుకదా. రావద్దు అంటే ఆగేవి కావు. 'జిహ్వా చాపల్యం అంత గొప్పదన్నమాట. ఆమె తనలో తనే గణించుకుంటోంది.

అవునూ! మిగిలిన ఇద్దరి కూతుళ్లను, కొడుకులను, మనవళ్లను, మనవరాళ్లను అందరినీ తను పోయేలోగా ఓసారి చూసుకోవద్దూ!' ఆలోచన వచ్చిందే తడవుగా ఒరేయ్ పెద్దోడా! అంటూ పిలిచింది.

బదులు లేదు.

ఓపిక తెచ్చుకుంటూ మరోసారి పిలిచింది. రామ్మూర్తి గది గుమ్మం దగ్గరికివచ్చి ఏంటమ్మా పిలిచావా అడిగాడు

అవున్రా అబ్బాయ్! చెల్లెళ్లని, తమ్ముళ్లని ఒకసారి వచ్చి చూసిపొమ్మని ఉత్తరాలు రాయరా. ఆ తర్వాత నేనేమైనా ఫరవాలేదు అందామె నెమ్మదిగా

'అలాగేలే అమ్మా. ఇవాళే రాస్తాను' అంటూ అక్కడ్నుంచి కదిలాడు రామ్మూర్తి.

ఇల్లంతా సందడిగా ఉంది. తన ఐదుగురి సంతానాన్ని వాళ్ల పిల్లల్ని ఒకేసారి ఒకేచోట చూసి సంతోషపడింది సావిత్రమ్మ. అందర్నీ దగ్గరకు పిలిచి, పక్కన కూచోపెట్టుకొని ఆప్యాయంగా చేయి నొక్కుతూ, నెమ్మరాస్తూ కుశలప్రశ్నలు వేసింది.

వాళ్ళు 'నీకేం ఫర్వాలేదు. ఏమీ కాదు' అంటూ మాట్లాడారే కానీ 'తను పోతుందేమో' అన్న బెంగ అంతగా ఏం కనపడలేదు వాళ్లల్లో.

'సుశీలా'! అంటూ పెద్దకోడల్ని పిలిచి 'అందరికీ ఏమేం కావాలో సరిగ్గా కనుక్కోమ్మా. అంతదూరం నుండి వచ్చారు. నీ ఒక్కదాని వల్లా కాకపోతే ఈ నాలుగురోజులకు వంటకు కామాక్షమ్మను పిలిపించు'

'అయ్యో మీరంతగా చెప్పాలా. నాకా మాత్రం

తెలీదూ?' వెటకారంగా అంటూ విస్మ్రయించింది.

రాత్రి భోజనలయ్యాయి. సావిత్రమ్మకు గదిలోనే స్టూలువేసి పెట్టారు.

కూతుళ్లు జానకి, అలిమేలు వచ్చి కూచున్నారు.

'నీ దగ్గర నల్లపూసల గొలుసుండాలిగా?' అని ఒకరంటే, 'కాసులపేరు ఏం చేశావు?' అని మరొకరు అడిగారు.

'వాడేముందే. పెద్దాడు బ్యాంకిలో పెట్టాడు. నే పోయాక అన్నీ చూసుకొని అందరూ సమంగా తీసుకోండి' అందామె.

సావిత్రమ్మే స్వయంగా అప్పటికప్పుడు తమ చేతుల్లో ఏదో పెడ్తుందనుకున్న వాళ్లకి ఆమె మాటలు చికాకుపెట్టాయి.

'పగలల్లా ప్రయాణంతో నడుం పట్టేసింది. ఇక పడుకుంటాం' అన్నారు వెంటనే.

'నాకు నిద్దర రావటల్లేదు. రోజూ ఒక్కదాన్నే గోడకేసి చూస్తూ పడుకుంటాను. మీరొచ్చారుగా మీరు కూడా ఇక్కడే పడుకోండి. చుట్టూ మనుషులుంటే అదో ధైర్యం' అందామె.

లేదులే అమ్మా. ఈ గదిలో ఊపిరాడటల్లేదు. అలా మేడ మీద పడుకుంటాం. నీకు భయమేంటి. నీ ఇల్లేగా' అంటూ అక్కణ్నుంచి కదిలారు.

సావిత్రమ్మ అవాక్కయింది. 'తనేం సేవలు చేయమన్లేదే! తోడుగా పడుకోమంది. ఔరా. ఎంత నిర్మొహమాటంగా జవాబిచ్చారు. తన కూతుళ్లేనా వీళ్లు, ఇన్నాళ్లూ కోడలే అనుకుంది. ఎవరైనా ఇంతేనన్న మాట' నిట్టూరుస్తూ గోడలోనే తోడును వెతుక్కుంటూ అటువైపు తిరిగింది.

అమ్మాయ్ సుశీలా! ఎలా ఉందే మీ అత్తకు. రాజేశ్వరమ్మ గొంతును ఇట్టే పోల్చుకుంది గదిలోని సావిత్రమ్మ. కోడలేం బదులిస్తుందో అని చెవులురిక్కించింది.

'ఆ ఏమిటో పిన్నీ. డాక్టరేమో ఏ క్షణాన్నయినా పోవచ్చన్నాడు. కానీ ఈమె మాత్రం నిక్షేపంగా ఉంది. కొడుకుల్ని పిలవమంది. కూతుళ్లను పిలవమంది. నా మొగుడో పిచ్చి మారాజు. తల్లి చెప్పిన వెంటనే అందరికీ ఆహ్వానాలు పంపాడు. వెంటనే వచ్చి వాలారంతా. చెయ్యలేక చస్తున్నా. పిల్లలేమో ఐస్క్రీములంటారు. మామిడిపళ్లంటారు. సినిమాలంటారు. షికార్లంటారు. ముగ్గురు పిల్లలంటే ఎలాగోలా తంటాలుపడతాం. ఇప్పుడీ మందతో నాటికెంత ఖర్చవుతుందో నువ్వే ఆలోచించు పిన్నీ. కాఫీలకంతేలేదు. పైగా ఇంతా చేశాక ఈ కూరనచ్చదు. ఆ పచ్చడి నచ్చదని విసుగులు. పైగా వచ్చిన వాళ్లందరికీ మాయరోగాలేనట. ముసలామెను చూడ్డానికి డాక్టరొస్తే గవర్నమెంట్ డాక్టరొచ్చినట్లు అందరూ చెకప్‌లు చేయించుకోవడం. ఇంకా వంటమనిషిని పెట్టమని సలహా ఇస్తుంది ముసలమ్మ. మంచంలో పడుకొని కంచాలు ఇస్త్రీ చేయడమనుకుంటోంది. మాకెంత ఖర్చు అవుతుంది. మంచీ— చెడ్డా ఇవేమీ ఆమెకు పట్టలేదు' ఏకరువు పెడుతోంది సుశీల.

'అమ్మోయ్ కూర మండుతోంది' మనవరాలు కాంచన అరిచింది.

'నాకు చెప్పాలంటే అమ్మాయ్. మొన్న మొన్నటిదాకా నేనూ ఇలాంటి బాధలుపడ్డదాన్నే. కూర సంగతి చూసుకో నే వస్తా' విషయాన్ని రాబట్టాక లౌక్యంగా దాటుకుంది రాజేశ్వరమ్మ.

సుశీల గబగబా లోపలికి నడిచింది.

'సావిత్రమ్మ మనసులో ముళ్లుగుచ్చుకున్నట్టయింది.

'తనవల్లేగా ఈ బాధలన్నీ' అనుకుంది. తనేం చేయగలదు. రమ్మనయితే చెప్పగలిగింది గానీ వెళ్లమని ఎలా చెబుతుంది' నిట్టూర్చింది.

మధ్యాహ్నం భోజనాలయ్యాయి. అందరూ హాల్లోకి చేరారు. సావిత్రమ్మ రెండోకొడుకు గిరిధర్ అంటున్నాడు 'ఎన్నాళ్లిలా సెలవు దండగ పెట్టుకొని ఇక్కడుంటాం! నేను రేపు వెళ్లిపోదామనుకుంటున్నా'

'నేనూ అదే అనుకుంటున్నా. అక్కడ మీ బావగారు ఏం అవస్థపడుతున్నారో. ఏదన్నా వార్త వస్తే అప్పుడే రావచ్చు. అటో, ఇటో ఇప్పట్లో తేలేలాగా లేదు' జానకి అంది.

మిగిలిన వాళ్లు దాదాపు అదేవిధంగా మాట్లాడారు.

సావిత్రమ్మకు ఓ రకంగా విచారం. ఓరకంగా సంతోషం అనిపించింది. తను పోతుందేమో అని వాళ్లెదురు చూడటం బాధ కలిగిస్తే, తను ఏమీ చెప్పకుండానే వాళ్లంతట వాళ్లు వెళ్లిపోవడం ఆమెకు సంతోషం కలిగించింది.

ఆ సాయంత్రం మూడోవాడు శంకరం తల్లిని మెల్లగా లేవదీసి పేముకుర్చీలో కూర్చోపెట్టి ఫోటో తీశాడు. సావిత్రమ్మ చాలా ఆనందించింది. ఎందుకంటే ఫోటో దిగడమన్న ముచ్చట ఆమెకు ఆనాటివరకు తీరనేలేదు. ఆమె మనసులోనే అనుకుంటోంది. 'తమ పెళ్లినాటికి ఫోటోల పిచ్చి అంతగా ఉండేదికాదు. పెద్దాడు ప్రేమించి పెళ్లి చేసుకురావడంతో ఆ సందర్భమూ తప్పిపోయింది.

ఆ తర్వాత ఆయన పోవడంతో తనను సరదాలమండి నిషేధించారు. ఫోటోలు తీసేటప్పుడు ఎవరైనా పిలిస్తే ముందుకెళ్లాలని ఉండేది తనకు. కానీ ఎవరూ పిలిచేవాళ్లు కాదు. తనంతట తను అడిగితే ఏమంటారో అని జంకు. ఇన్నాళ్లకి శంకరం తన కోరిక తీరుస్తున్నాడు.

'శంకరం! ఫోటో ఎప్పుడొస్తుందిరా?' అడిగిందామె. అందరూ ఫుసుక్కున్న నవ్వారు.

'రీలులో ఇదే మొదటిదమ్మా. ఊరెళ్ళాక మిగతావి తీసి నీకు పంపిస్తాలే' అన్నాడు.

సావిత్రమ్మకు ఏ మూలో అసంతృప్తి.

అంతా వెళ్లిపోయారు. సావిత్రమ్మకు ఒంటరితనం మరీ ఎక్కువయింది. రాత్రంతా గోడకేసి చూస్తూ గడిపిన ఆమెకు ఆలోచనలతో మనసంతా భారమైంది. గుండె బరువెక్కింది. ఒళ్లంతా చెమటలు. దాహం వేసింది. 'పెద్దాడా'? అని పిలుద్దామనుకుంది. మాట పెగల్లేదు. స్టూలుమీద గ్లాసు అందుకోబోయింది. అది చేయి తగిలి చప్పుడుచేస్తూ కింద పడ్డది. లాభం లేదు. దాహం తీరదు. ఆమెకేదో లీలగా తోచింది. ఇంకా తన ఫోటో చూసుకోనే లేదు.

గ్లాసు చప్పుడుకు నిద్దరపోతున్న రామ్మూర్తి లేచి వచ్చాడు. తల్లి పరిస్థితి అతడికి అనుమానం కలిగించింది. కంగారుగా 'ఏంటమ్మా ఎలావుంది' కుదుపుతూ అడుగుతున్నాడు.

ఆమె మెదడుకు కనెక్షన్ సడలుతోంది. ఏం చెప్పలేకపోయింది. కానీ మాటవచ్చుంటే ఖచ్చితంగా అది ఫోటో గురించే అయ్యుండేది. బలహీనమైన ఆమె గుండె చప్పుడుచేయనని మొరాయిస్తూ ఆగిపోయింది.

మర్నాడు మళ్లీ అంతా దిగారు. శంకరం ఫోటో తెచ్చాడు. 'చూశావా అన్నయ్యా! నేను అమ్మకు ఫోటో తీయడం ఎంత మంచిదయిందో! పేపర్లో వేయిస్తానని ఓ పేపరాఫీసుకు వెళ్లాడు. ఆ మర్నాడు సావు పేజీలో సావిత్రమ్మ ఫోటో. దానికింద కుటుంబమందరి పేర్లూ ఓ లిస్ట్‌గా రాశారు. సావిత్రమ్మ ఎవరో ఏమిటో తెలీనీ ఎన్ని వేలమందో ఆ ఫోటో చూశారు కానీ ఆ ఫోటోలోని మనిషి మాత్రం చూసుకోలేకపోయింది.

●

